# <u>పత్రికా ప్రకటన</u>

తేది.09.08.2017.

## <u>మట్టి వినాయక విగ్రహాలను ఆవిష్కరించిన పోలీస్ కమీషనర్</u>

వినాయక చవితి పండుగ వేడుకలను పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణ సమితి ఎన్‌జిఓ సంస్థ తయారు చేసిన మట్టి వినాయక విగ్రహాలను ది. 9. 8. 17న నగర పోలీస్ కమీషనర్ శ్రీ డి.గౌతం సవాంగ్ ఐపిఎస్ గారు ఆవిష్కరించడం జరిగింది.

బి.ఆర్.టి.ఎస్. రోడ్డు నందు పడవలరేవు సమీపంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహాలను సిపి గారు పరిశీలించి, తయారీ విధానం గురించి పర్యావరణ పరిరక్షణ సమితి ప్రెసిడెంట్ శ్రీ రఘురామ్ గారిని అడిగి తెలుసుకుని, యుకోఫ్రెండ్లీలో భాగంగా పర్యావరణం కాపాడేందుకు మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసినందుకు శ్రీ రఘురామ్‌ను మరియు పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులను ఆయన అభినందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణ కాలుష్యం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో సహజ పర్యావరణ ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణను బాధ్యతగా తీసుకుని జీవితంలో భాగంగా చేసుకోవాలన్నారు. సాంప్రదాయంగా జరుపుకునే వినాయక చవితి పండుగలో మట్టి విగ్రహాన్ని వినియోగించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడాలన్నారు. దీనిపై క్షేత్ర స్థాయిలో పాఠశాలలు, కళాశాలలలో పలు కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు అలాగే ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. అనంతరం “మట్టి విగ్రహాలను పూజించండి-పర్యావరణాన్ని పరిరక్షించండి” అనే నినాదంతో ప్రచురించిన గోడప్రతిని పోలీస్ కమీషనర్ గారు ఆవిష్కరించారు.

అలాగే నగరంలో వినాయక చవితి వేడుకలు జరుపుకునే నిర్వాహకులు అనుమతులు తీసుకుని, నియమ నిబంధనలు, ముందస్తు జాగ్రత్తలు పాటించాలని తద్వారా పోలీస్ శాఖ నుండి సహకారం అందిస్తామన్నారు. తప్పని సరిగా భద్రత కోసం రాత్రి సమయాల్లో మండపాల వద్ద కాపలా ఉండేలా చూసుకోవాలని, నియమ నిబంధనల ప్రకారం నిర్ధేశించిన స్పీకర్లను మాత్రమే వినియోగించాలన్నారు. ముఖ్యంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చూడాలన్నారు.

పండుగ సందర్భంగా చందాల వసూళ్ల వంటి కార్యక్రమాలు జరగవని భావిస్తున్నట్లు ఆయన పేర్కొంటూ ఒక వేళ ఇటువంటి ఘటనలు ఉత్పన్నమైతే డయల్ 100కు సమాచారం అందించిన పక్షంలో తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గతంలో జరిగిన కృష్ణా పుష్కరాలు మరియు దసరా వేడుకల మాదిరిగా వినాయక చవితి పండుగ వేడుకలు కూడా అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆయన తెలియజేశారు.

కార్యక్రమంలో లా & ఆర్డర్ 1 డిసిపి శ్రీ డా.గజరాజ భూపాల్ ఐపిఎస్, సెంట్రల్ ఏసిపి శ్రీ సత్యానందం, మాచవరం ఇన్‌స్పెక్టర్ శ్రీ ఉమామహేశ్వరరావు, పర్యావరణ పరిరక్షణ సమితి ప్రెసిడెంట్ శ్రీ రఘురామ్, సెక్రటరీలు శ్రీ దుర్గాప్రసాద్, జయంతి రమణ తదితరులు పాల్గొన్నారు.

-- xx --